

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయంలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 57 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 28 ఫిర్యాదులు

- అర్జీలను పెండింగ్ పెట్టొద్దు : కలెక్టర్ బీఎం సంతోష్



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 28 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

జడవరు.. విడవరు



అమిస్తాపూర్ శివారులో ఫిల్టర్ ఇసుక డంప్

- కేసులవుతున్నా ఉమ్మడి జిల్లాలో ఆగని ఇసుక అక్రమ రవాణా
- మహబూబ్‌నగర్ శివారులో యథేచ్ఛగా ఫిల్టర్ ఇసుక దందా
- ఒక్కో టిప్పర్ ధర రూ.25 వేలు
- ప్రభుత్వ పనుల్లో ఇదే ఇసుక వాడటంతో నాణ్యత గుల్ల
- గతంతో పోల్చితే ఇసుక అక్రమ రవాణా నిలుపుదలపై తగ్గిన శ్రద్ధ
- కొన్నిచోట్ల నిద్రావస్థ.. సమాచారమిచ్చినా అధికారుల స్పందన అంతంతే



మిడ్జిల్ మండలంలో దుందుభీ వాగు నుంచి ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న కూలీలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో ఇసుక అక్రమ రవాణా రోజు రోజుకూ మితిమీరిపోతోంది. గతంలో ఉన్న శాండ్ ట్యాక్సీ పాలసీలు ఇప్పుడు అమలు కావడం లేదు. అలాగే ప్రభుత్వం ఇసుక రీచ్‌లకు ప్రత్యేకంగా అనుమతులు ఇవ్వకపోవడం కూడా అక్రమ రవాణాకు కారణమవుతోంది. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సమీప వనరుల నుంచి తీసుకోవచ్చని గవర్నమెంట్ చెప్పడం కూడా అక్రమంగా తరలించి.. సొమ్ము చేసుకుంటున్న వారికి కలిసి వస్తోందని చెప్పొచ్చు. మరికొన్నిచోట్ల అనుమతులు లేదంటే ప్రభుత్వ పనుల పేరుతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. పోలీసులు అడపాదడపా తనిఖీలు చేసి.. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ, గతంకంటే శ్రద్ధ చాలావరకు తగ్గింది. కేసులు నమోదువుతున్నా కూడా కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లాలో భవన నిర్మాణ రంగం ఊపు మీద ఉంది. నిర్మాణాలకు ప్రధాన వనరు అయిన ఇసుక కొరత తీవ్రంగా ఉంది. దీంతో అక్రమార్కులు ఎంత రేటు పెట్టిన కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో మాదిరిగా శాండ్ ట్యాక్సీ పాలసీలను పకడ్బందీగా అమలు చేయడం లేదనే విమర్శలు వస్తున్నా, అధికారులు పట్టిం చుకోవడం లేదు. గతంలో ఉన్న పాలసీలతో ప్రభుత్వానికి ఆదాయం రావడంతోపాటు అక్రమ ఇసుక రవాణాను కొంతమేర నియంత్రించారు. ఇప్పుడా పరిస్థితి లేదనే చెప్పొచ్చు.

ఫిల్టర్ ఇసుక దందా జోరు..

మొన్నటి వరకు ఎర్రమట్టిని కేవలం రియల్ ఎస్టేట్ వెంచర్లు చదును చేయడానికి, ఇళ్ల నిర్మాణంలో వాడటానికి మాత్రమే ఉపయోగించేవారు. ఇప్పుడు ఎర్రమట్టిని ఫిల్టర్ ఇసుకకు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. ఈ ఇసుక వాడటం వల్ల నిర్మాణాల్లో నాణ్యత ఉండదు. మర్కెట్‌లో ఇసుక కొరత కారణంగా కొందరు ప్రైవేటుగా ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్న వారు కూడా ఈ ఇసుకను వాడుతుండగా, ప్రభుత్వ (మిగతా 6లో..)

తహసీల్దార్ వే బిల్లుల పేరుతో

ఖిల్లాఘనపురం మండలంలోని కొత్తపల్లి ఇసుక రీచ్‌కు గత ప్రభుత్వంలో అనుమతులు ఉండేవి. ప్రస్తుతం పరిసర గ్రామాల ట్రాక్టర్ యజమానులు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. ఇళ్ల ముందు డంప్ చేసుకుని, రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా బయటకు తరలిస్తున్నారు. తహసీల్దార్ వే బిల్లుల పేరుతో కూడా ఈ మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. కొన్ని ట్రిప్పులకు అనుమతులు తీసుకుని ఎక్కువ తరలిస్తున్నారు. వనపర్తి మండలం పెద్దగూడెం, కిష్టగిరి, కాశీంనగర్, చిట్యాల శివారుల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. చిట్యాల శివారులోని పొలాల్లో అక్కడక్కడ ఇసుక డంపు చేశారు. వీపనగండ్ల మండలం తూంకుట వాగు నుంచి ఇసుక అక్రమ తరలింపు కొనసాగుతోంది. పాన్‌గల్ మండలంలోని దావాసిపల్లి శివారులో ఫిల్టర్ ఇసుక దందా నడుస్తోంది. గోపాల్‌పేట మండలం చెన్నూరు వాగు నుంచి ఎక్స్‌కవేటర్‌తో ఇసుక డంపు చేసి, రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు.

పేటకు 21న సీఎం రేవంత్‌రెడ్డి రాక



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాకు ఈ నెల 21న వస్తున్న సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం హెలిప్యాడ్ కోసం స్థలాన్ని ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి పరిశీలించారు. ఫొటోఎగ్జిబిషన్, స్టేజీ తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. 21న సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. వాటిలో మెడికల్ కళాశాల టీచింగ్ హాస్పిటల్, వంద పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల, రెండు పోలీస్ స్టేషన్ల భవన నిర్మాణాలు, పెట్రోల్ బంక్, మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలం, ట్రైనీ కలెక్టర్ గరీమానరుల, అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్‌హక్, ఆర్డీవో రాంచందర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాంకిషన్, పాల్గొన్నారు.

తుప్పు పడుతున్న.. 104 వాహనాలు



పెద్దమందడి పీహెచ్‌సీ ఆవరణలో నిలిపిన 104 వాహనాలు

పెద్దమందడి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బీపీ, మధుమేహం, అస్తమా, తదితర జబ్బులతో బాధపడేవారికి వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన 104 వాహనాలు తుప్పు పడుతున్నాయి. 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సంచార వైద్యం పేరుతో 104 వాహనాలు ప్రారంభించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు 32 వాహనాలను కేటాయించారు. ఈ వాహనంలో వైద్యుడు, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర వైద్య సిబ్బంది ఉండేవారు. గ్రామీణ ప్రాంతంలోని వృద్ధులు మందుల కోసం పట్టణాలకు వెళ్లకుండా రోజుకు రెండు గ్రామాల చొప్పున నెలలో 52 గ్రామాల్లో వైద్య సేవలు అందించేవారు. అయితే 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ సేవలను నిలిపివేయడంతో వాహనాలు మూలనపడ్డాయి. వనపర్తి జిల్లాకు కేటాయించిన 3 వాహనాలు పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక భాగంలో తుప్పుపట్టిపోతున్నాయి. లక్షలు వెచ్చించి జిల్లాకు కేటాయించిన వాహనాలు తుప్పు పట్టకుండా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఇతర అవసరాలకైనా వాడుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం

మూడేళ్ల క్రితం నుంచి ప్రభుత్వం 104 సేవలను నిలిపి వేయడంతో వాటిని నిలిపి ఉంచాల్సి వస్తోంది. వాటిని ఏలా వినియోగించుకోవాలో అని ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఆదేశిస్తే ఇతర అవసరాలకు వినియోగిస్తాం.

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాస్

గుర్తింపులేని ధ్రువపత్రాలతో ఉద్యోగాలు

- వ్యవసాయ శాఖలో ఏఈవోలు నియమితులయ్యారని ఫిర్యాదులు
- విచారణను వేగవంతం చేసిన పోలీసులు
- వ్యవసాయ శాఖ ఉద్యోగుల్లో ఆందోళన

7

ఫీరోజ్‌గాంధీ ముస్లిం కాదు : మల్లురవి

ఎర్రవల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఫీరోజ్ గాంధీ ముస్లిం మతానికి చెందిన వ్యక్తి అని, దీంతో రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ కూడా ముస్లిం మతస్థులని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి మండిపడ్డారు. ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామికి సోమవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందించారు. పీఏసీఎస్ చైర్మన్‌ల పదవీ కాలం ఆరు నెలల పాటు పొడిగించడంతో గద్వాల, వనపర్తి పీఏసీఎస్‌ల అధ్యక్షులు ఎంపీని సన్మానించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిరోజ్ గాంధీ ముస్లిం మతానికి చెందిన వ్యక్తి కాదని, పార్సి మతస్థుడని ఆయన అంత్యక్రియలు కూడా అదే మత సంప్రదాయంగా జరిగాయన్నారు. అర్థరహిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ వెంటనే ఆ మతానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు రంగారెడ్డి, గౌనిబుచ్చారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండంత పని.. గోరంత వేతనం



- పంచాయతీల్లో కారోబార్ల వెతలు
- చాలీచాలని జీతాలతో అవస్థలు
- ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ కరువు
- సమస్యలు పరిష్కరించాలని వినతి

7



డీఈవో కార్యాలయం

స్వాప్ బదిలీల్లో తప్పుడు ధ్రువపత్రాలు

- జోగుళాంబ గద్వాల జిల్లాలో భర్త ఉద్యోగం
- పాలమూరులో ఉన్నట్లు చూపించి పోస్టింగ్

7

అద్దె చెల్లించని దుకాణాలు సీజ్

- మహబూబ్‌నగర్ బస్టాండ్ పక్కనే ఉన్న రెవా హోటల్, దుకాణాల సముదాయానికి తాళం వేసిన కార్పొరేషన్ అధికారులు

7

సాగునీరందించాలి

- మూడు గంటల పాటు రైతుల రాస్తారోకో



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారులు

పాన్‌గల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎంజీకేఎల్ఐ డిస్ట్రిబ్యూటర్ 8 మేజర్ కెనాల్ 4 ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాలని సోమవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం అన్నారం దగ్గర రోడ్డుపై వివిధ గ్రామాల రైతులు బైఠాయించి రాస్తారోకో చేశారు. కాలువలో పేరుకుపోయిన పూడికె తీత పనులు చేపట్టకపోవడం, అక్కడక్కడ లింకు కాలువలను పూర్తి చేయకపోవడం వల్లే పంటలకు సాగునీరు అందడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్లే ఈ సమస్య దాపురించిందని వాపోయారు. అధికారులు వచ్చి కాలువకు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తి చేసే వరకు ఆందోళన విరమించేదిలేదని తేల్చి చెప్పారు. దాదాపు 3 గంటల పాటు ప్రధాన రోడ్డుపై వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రావు, డీఈ వెంకటరమణ, సీఐ కృష్ణ వచ్చి రైతులను శాంతింపజేశారు. కాలువ పనులు పదిరోజుల్లో పూర్తిచేసి సాగునీరు అందేలా చర్యలు తీసకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

బ్రహ్మోత్సవాలు ఐక్యతను పెంపొందిస్తాయి

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



రథానికి కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అయిజ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలు అన్ని వర్గాల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు అన్నారు. తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి జరిగే రథోత్సవానికి కొబ్బరి కాయ కొట్టి పూజలు చేశారు. పండుగలు, శుభకార్యాలు వర్గాల వారిగా చేసుకుంటారు. బ్రహ్మోత్సవాలు, జాతర్లు ప్రజలందరూ జరుపుకుంటారని అన్నారు. అన్ని వర్గాల వారు కలిసి ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విష్ణు, లక్ష్మిరెడ్డి, అశోక్‌లు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన దుకాణాలు కూల్చివేత



బసవన్న సర్కిల్ సమీపంలోని దుకాణ సముదాయాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేయిస్తున్న అధికారులు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గద్వాల పట్టణంలోని బీరెల్లి రోడ్డు బసవన్న సర్కిల్ సమీపంలో మునిసిపల్ స్థలంలో అక్రమంగా నిర్మించిన దుకాణ సముదాయాన్ని సోమవారం అధికారులు కూల్చివేశారు. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ స్థలం సమీపంలోని కాలనీకి చెందిన పదిశాతం పబ్లిక్ స్థలం కాగా, కొందరు కబ్జా చేసి దుకాణాలు నిర్మించారు. నిర్మాణ సమయంలోనే మునిసిపల్ అధికారులు హెచ్చరించినా బేఖాతరు చేస్తూ నిర్మాణం కొనసాగించారు. నోటీసు జారీ చేసిన కమిషనర్ ముందస్తు సమాచారం ఇవ్వకుండానే సిబ్బందితో కలిసి వెళ్లి నిర్మాణాలను కూల్చివేయించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మునిసిపల్ కమిషనర్ దశరథ్ పట్టణంలో పబ్లిక్ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థలాలను ఆక్రమించిన వారిపై తెలంగాణ పురపాలక సంఘం చట్టం-2019 ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. బాధ్యులకు ఆస్తి నష్టంతో పాటు శిక్ష కూడా ఉంటుందని, ఈ విషయంలో ప్రజలు మునిసిపాలిటీకి సహకరించాలన్నారు.

జడవరు.. విడవరు



మహబూబ్‌నగర్ శివారులోని అమిస్తాపూర్‌లో తయారు చేస్తున్న ఫిల్టర్ ఇసుక



ఖిల్లాఘణపురం నుంచి ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్లు

(5వ పేజీ తరువాయి)

భవనాల నిర్మాణాలకు మెజారిటీ ఈ ఫిల్టర్ ఇసుకనే వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ శివారులోని భూత్పూరు మండలం అమిస్తాపూర్‌లో ఏకంగా ఎక్స్‌కవేటర్లతో మట్టి తీసి, దాన్ని అక్కడే ఫిల్టర్ చేసి, టిప్పర్లలో తరలిస్తున్నారు. అమిస్తాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ దందాను నడిపిస్తున్నారు. కేసు నమోదు చేశామని, అడ్డుకున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఈ ఇసుకను ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ (సుమారు 6 ట్రాక్టర్లు) ఇసుకకు రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఇసుక పాలసీలు సమర్థవంతంగా అమలైనప్పుడు కూడా ఇంత ధర లేదు. కానీ ఇప్పుడు ఫిల్టర్ ఇసుకకే ఇంత ధర వెచ్చించాల్సి వస్తోంది. ప్రభుత్వ నిర్మాణాల్లో ఫిల్టర్ ఇసుకను వాడటంతో అవి తొందరగా శిథిలావస్థకు చేరే అవకాశం ఉంది.

దుందుభీ నుంచి కొల్లగొడుతున్నారు

తాడూరు మండలం దుందుభీ నది పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో కొంతమంది అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రజలు అడ్డుకున్న సందర్భాల్లో అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని చెబుతూ తప్పించుకుంటున్నారు. వారం రోజుల క్రితం రైతులు పోలీసులను పిలిపించి ఓ ట్రాక్టర్‌ను అప్పజెప్పారు. వెల్దండ మండలంలోని వివిధ గ్రామాలకు వంగూరు మండలంలోని చింతపల్లి, చారకొండ మండలంలోని చంద్రాయనపల్లి, గోకారం వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. కల్వకుర్తి మండలంలోని ఎలికట్ట, మిడ్జిల్ మండలంలోని దుందుభి వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తీసుకెళ్తున్నారు. అప్పుడప్పుడు కేసులు నమోదు చేస్తున్నా పరిస్థితి మారడం లేదు. పెద్దకొత్తపల్లి మండలంలోని మారేడుమాన్‌దిన్నె, కొత్త యాపట్ల, పాత యాపట్ల, వేడుకరావుపల్లి, తిరునాంపల్లి, నారాయణపల్లి గంట్రావుపల్లిలో ఇసుక డంపులు ఉన్నాయి. అర్ధరాత్రి వేళ ఇసుకను తరలిస్తున్నారు. ఉప్పునుంతల మండలంలోని జప్తిసదగోడు, పెద్దపూర్, మొలగర గ్రామాల్లో దుండబీ వాగు నుంచి రాత్రి వేళల్లో ఇసుక స్వాహా చేస్తున్నారు. బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లిలో ఫిల్టర్ ఇసుక డంపులు చేశారనే ప్రజల ఫిర్యాదుతో డంపులను ఇటీవల సీజ్ చేశారు. ఇక్కడి నుంచి భూత్పూరు, జడ్చర్ల, గోపాల్‌పేట, నాగర్‌కర్నూల్, తాడూర్, తిమ్మాజిపేట మండలాలకు ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. చారకొండ మండలంలో గోకారం, చంద్రయాన్‌పల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తీసుకెళ్తున్నారు.

అర్ధరాత్రి వేళ తరలింపు

నవాబ్‌పేట మండలంలోని కారూర్, లోకిరేవు, ఇప్పటూరు గ్రామ పరిసరాల వాగుల నుంచి అర్ధరాత్రి వేళ ఇసుకను తరలిస్తున్నారు. రెండు మండలాల సరిహద్దు కావడంతో పోలీసులు కూడా పట్టించుకోవడం లేదు. కోయిలకొండ మండలంలోని సూరారం, ఆచార్యపూర్, మోదీపూర్, కోతలాబాద్ తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా, ఫిల్టర్ ఇసుక, ఇసుక డంపుల సీజ్ పరిపాటిగా మారింది. గండీడ్ మండలంలోని రంగారెడ్డిపల్లి, పగిడ్యాల వాగుల నుంచి అర్ధరాత్రి నుంచి ఉదయం 5 గంటల వరకు ఇసుక తరలిస్తున్నారు. ముందుగా ఇళ్ల వద్ద డంపులు చేసుకుని.. రాత్రి వేళల్లో తరలిస్తున్నారు. జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ఫిల్టర్ ఇసుక, అల్వాన్‌పల్లి, కుర్వగడ్డపల్లి ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. జడ్చర్లలో భవన నిర్మాణ రంగం ఊపు మీద ఉండటంతో ఆ నిర్మాణాలకు తరలిస్తున్నారు. రాజాపూర్ మండలంలోని దుందుభీ నది చివరిలో ఉన్న పలు గ్రామాల్లో ఫిల్టర్ ఇసుక తయారు చేసి టిప్పర్ల ద్వారా షాద్‌నగర్, జడ్చర్ల, పోలేపల్లి సెజ్‌లకు తరలిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు దాడులు చేసి, డంపులు సీజ్ చేసినా పరిస్థితి మారడం లేదు. మిడ్జిల్ మండలంలో దుందుభీ వాగు నుంచి ప్రభుత్వ అనుమతుల పేరుతో ఇసుక తరలింపునకు తహశీల్దార్ అనుమతులు ఇచ్చారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నారు. రైతులు ఫోన్ చేసినా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

వాగుల నుంచి అక్రమ రవాణా

గట్టు మండలంలో వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉండవల్లి మండలంలో ఇసుక రీచ్‌లు లేవు. కానీ పుల్లూరు, కలుగొట్ల గ్రామాల వారు ఏపీ శివారులోని పలు గ్రామాల పరిధిలోని తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పోలీసులు అప్పుడప్పుడు దాడులు చేస్తున్నారు. ఇటీవల అడ్డుకోవడానికి వెళ్లిన పోలీసులను ట్రాక్టర్‌తో ఢీకొట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం. నదిలో ఇసుక కొరత ఉండటంతో ఏపీలోని పంచలింగాల, మునగాలపాడు, నిడ్జూరు, తాండ్రపాడు గ్రామాల నుంచి టిప్పర్ల ద్వారా తెలంగాణలోకి రవాణా చేస్తున్నారు. కేటీదొడ్డి మండలంలోని వాగుల నుంచి ఇసుక తరలిస్తున్నా అడపాదడపా తప్ప కేసులు నమోదు కావడం లేదు.



వనపర్తి మండలం చిట్యాల శివారులో ఇసుక డంపు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 17, (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చిలో నిర్వహించనున్న వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి, జిల్లాకు వసతి గృహాలకు మంచిపేరు తేవాలని కోరారు. సబ్జెక్టులపై పట్టు సాధించడానికి కష్టపడి చదవాలన్నారు. రోజూ ఉపాధ్యాయులతో మాట్లాడి అవగాహన పెంచుకోవాలన్నారు. హార్డ్ వర్క్ చేస్తేనే ఏదైనా సాధ్యమవుతుందని చెప్పారు. పరీక్షలకు 15 రోజుల ముందు సబ్జెక్టులకు ప్రిపేర్ కావాలన్నారు. అనంతరం ఆల్‌ఇన్‌వన్ క్వశ్చన్ బ్యాంకులు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఇన్‌స్పిరేషన్ లెటర్లను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి అబ్దుల్ కలీం, డీఆర్‌డీవో మొగులప్ప, డీపీఆర్వో రషీద్, ఉపాధ్యాయులు స్వామి, సంగీత, నారాయణరెడ్డి, మధు, మహేష్, మధుసూదన్‌రావు, వసంత్‌రావు, కనకప్ప, శ్రీలక్ష్మి, రోజమని పాల్గొన్నారు.



శివాలయం వద్ద వక్తలను సన్మానించి జ్ఞాపికలను అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

పెద్దకడ్మూర్‌లో ధ్వజస్తంభం ప్రతిష్ఠ

● పూజా కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దకడ్మూర్ గ్రామంలోని శివాలయం వద్ద సోమవారం ధ్వజస్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠాపనలు జరిగాయి. గ్రామస్థుల సహాయ సహకారాలతో ఈ పురాతన ఆలయాన్ని మరమ్మతులు చేసి పునఃప్రారంభించారు. సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మొగల్‌మడ్క గ్రామం నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా బయల్దేరిన శివస్వాములు

శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు

దామరగిద్ద/మరికల్/మాగనూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల శివస్వాములు సోమవారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈనెల 26న మహాశివరాత్రి ఉండడంతో సోమవారం నుంచి పాదయాత్రగా బయల్దేరారు. మరికల్ పట్టణంలోని హనుమాన్‌వాడ పరిసర ప్రాంతం సోమవారం శివనామస్మరణతో మారుమోగింది. గురుస్వామి జగదీష్ ఆధ్వర్యంలో పలువురు స్వాములు ఇరుముడులు కట్టుకొని 20 మంది స్వాములు పాదయాత్రన, మరికొందరు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. మాగనూరు మండల కేంద్రంలోని దేవాలయాల్లో పలువురు శివస్వాములు సోమవారం శ్రీశైల క్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. గురుస్వామి సంగణ బసవ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వాములు ఇరుముడులతో పాదయాత్రగా బయలు దేరారు.



మాట్లాడుతున్న మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌భోగేశ్వర్లు

'ఇందిరా మహిళాశక్తి'పై సమీక్ష

నారాయణపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కోస్గి, మక్తల్, నారాయణపేట రిసోర్స్‌పర్సన్స్‌లతో సోమవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, కమిషనర్ భోగేశ్వర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. మెప్మా కార్యక్రమాలపై సమీక్షిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన విధంగా కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. బ్యాంక్ లింకేజీల ద్వారా రుణాలు ఇప్పించి మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలన్నారు. ఇందిరా మహిళశక్తి కార్యక్రమాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శివకుమార్, మెప్మా సిబ్బంది ఉన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి




మహిళా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న టాస్క్, సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు కుటుంబ పోషణ కోసం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో మహిళలకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో పని చేయడానికి పెద్ద ఎత్తున మహిళలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో రాణిస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందని దీంతో వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. కుటుంబంలో మహిళలు ఉద్యోగం చేస్తే ఆర్థిక క్రమ శిక్షణ చేకూరుతుందన్నారు. మహిళల కోసం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశ్రమల్లో మహిళలు ఉద్యోగ అవకాశాలు పొందడానికి కుటుంబ సభ్యులు సైతం ప్రోత్సహించాలని సూచించారు. ఫాక్స్‌కాన్ కంపెనీ సభ్యులు నిక్కు, మీరా, మహేష్, టాస్క్ సభ్యురాలు లావణ్య, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు ఆర్.అనిల్‌గౌడ్, శ్రీపతిరాజు, పలువురు సభ్యులు తదితరులు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



ఆంజనేయస్వామి ఆలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాలలో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జా తీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆ చారి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్ కుమార్, పలువురు నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వా హకులు వారిని పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ధర్మాన్ని పాటించాలని కోరారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం సైతం చేయూతగా నిలుస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, పలువు రు నాయకులు తదితరులు ఉన్నారు.

చెంచుల జాతరను ఘనంగా నిర్వహించాలి

- త్వరలోనే గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యటించే ఆస్కారం

- గవర్నర్ గ్రాంట్ ద్వారా రూ. 77 లక్షలతో బోరు బావుల తవ్వకం,

- సౌరశక్తి వీధి దీపాల ఏర్పాటు

కలెక్టర్ బదావత్ సంతోష్



భౌరాపూర్ జాతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మన్ననూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి రోజున నల్లమల ప్రాంతంలోని భౌరాపూర్‌లో చెంచుల జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలంలోని అప్పాపూర్, భౌరాపూర్ పెంటల్లో ఆయన సోమవారం పర్యటించారు. పెంటల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భౌరాపూర్ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అప్పాపూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆయన పాఠాలు బోధించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చక్కగా చదువుకొని ప్రయోజకులు కావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా చెంచులతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నల్లమల అటవీ ప్రాంతంలోని అప్పాపూర్, ఆగర్లపెంట, రాంపూర్, మేడిమాల్కల, ఈర్లపెంటల్లో నివసించే చెంచుల తాగునీటి సౌకర్యార్థం రూ.59 లక్షలతో బోరుబావులను తవ్వించనున్నట్లు తెలిపారు. రూ.18లక్షలతో సౌరశక్తి వీధి దీపాల ఏర్పాటు, రూ.10లక్షలతో చెక్‌డ్యామ్ నిర్మాణం, రూ15లక్షలతో చెంచు యువతకు ఉపాధి అవకాశాల కోసం స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెలలోనే రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన ఉంటుందని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్‌కు చెందిన రంజీ క్రీడాకారుడు నాగేందర్ చెంచు విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం సోమవారం సాయంత్రం భౌరాపూర్ భ్రమరాంబ ఆలయంలో కలెక్టర్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని చెంచు పూజారులతో 26న జరిగే శివ పార్వతుల కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. అదేవిధంగా పీటీజీ గురుకుల పాఠశాలలో బస చేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడి, డీటీడీవో ఫిరంగి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి చిన్న ఓబులేష్, జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరి, అచ్చంపేట ఆర్డీవో మాధవి, మిషన్ భగీరథ అధికారులు సుధాకర్‌సింగ్, హేమలత, లింగాల తహసీల్దార్ పాండు నాయక్, స్థానిక చెంచు నాయకులు తోకల గురువయ్య, బాల గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణం ఇవ్వడంలేదని బైక్‌కు నిప్పు

తెలకపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులు రుణం ఇవ్వడం లేదం టూ సోమవారం ఓ రైతు బ్యాంకు ఎదుట తన బైక్‌కు నిప్పు పెట్టాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. నాగర్‌కర్నూలు జిల్లా తెలకపల్లి మండలంలోని గోలగుండం గ్రామానికి చెందిన చందు అనే రైతు తల్లి నిరంజనమ్మ పేరున ఇదివరకే రూ. 1.30లక్షల రుణం ఉన్నది. అందులో రూ. 1.20 లక్షలను ప్రభుత్వం మాఫీ చేసింది. తన తల్లి పేరున మళ్లీ రుణం కావాలని తెలకపల్లిలోని బ్యాంకు ఆఫ్ బరోడా సిబ్బందిని కోరాడు. మాఫీకాని డబ్బు చెల్లిస్తేనే మళ్లీ రుణం ఇస్తామని బ్యాంకు సిబ్బంది చెప్పారు. దీంతో ఆగ్రహించిన చందు బయటకు వచ్చి బ్యాంకు ముందు ఉన్న తన బైక్‌కు నిప్పుపెట్టాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.



దహనం అవుతున్న బైక్

విజయవంతమైన జాబ్ మేళా

కొల్లాపూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఐక్యూఏసీ నిర్వహణలో, ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. జాబ్ మేళాకు కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఉద్యోగార్థులు, కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 95 మంది రిజిస్ట్రేషన్ చేసుకుని అవసరమైన సర్టిఫికెట్స్‌తో హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎస్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ... ప్రతీ రంగంలో ఉద్యోగాలకు తీవ్రమైన పోటీ ఉన్న ఈ రోజుల్లో ఉద్యోగ అవకాశాలు దొరకడం చాలా కష్టం. కావునా మన కళాశాలలో ఫాక్స్‌కాన్ కంపెనీ వాళ్ల కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోగలరని ఆయన సూచించారు. తరువాత ఫాక్స్‌కాన్ కంపెనీ ఎండీ మూర్తి మాట్లాడుతూ... ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగం పొందిన వారికి వేతనం రూ.15వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఫ్యామిలీ హెల్త్ కార్డు, ఇంక్రిమెంట్స్, ప్రమోషన్ వంటి అవకాశాలతో మంచి ఆర్థిక స్థిరత్వాన్ని కల్పిస్తుందని తెలిపారు. తరువాత ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి మొత్తం 45 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు కురుమయ్య, సోఫీ పాషా, మహాదేవుడు, శివుడు, బాలరాజు, విష్ణు, బాలు, అనిత, మౌనిక, బోధనేతర సిబ్బంది బాలయ్య, వనిజ కుమారి ఉన్నారు.



జాబ్ మేళాకు హాజరైన యువతీ యువకులు, విద్యార్థులు

ఎంఎల్‌హెచ్‌పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్



మాట్లాడుతున్న ఏఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్

కందనూలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో మూడు సంవత్సరాల నుంచి ప్రైమరీ హెల్త్ సెంటర్ స్థాయిలో వైద్య సేవలందిస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు బేసిక్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు అమలు చేయకుండా అతి తక్కువ జీతాలతో విధులు నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఎంఎల్‌హెచ్‌పీల జనరల్‌బాడీ సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన లక్ష్మణాచారి భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతతో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎన్నిక చేయబడిన ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగులకు కనీస వేతనం రూ. 44వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 30వేల జీతం మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. అధిక పని భారాన్ని వారిపై మోపుతున్నారని, అన్ని స్థాయిల పనులు వారితో చేయించుకోవడం అన్యాయమన్నారు. ఈ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సాయికుమార్, వైస్ ప్రెసిడెంట్ భారతి, వరలక్ష్మీ, జనరల్ సెక్రటరీ పవన్‌కల్యాణ్, కోశాధికారి రాజునాయక్, కల్పన, శ్రుతి, అంజలి, తేజశ్రీ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంఆర్ సునీత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.ఆర్ సునీత

వనపర్తి క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.ఆర్ సునీత అన్నారు. సోమవారం జిల్లా న్యాయ స్థానంలో జిల్లాన్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ అధి కారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. క్రిమినల్ కంపౌండబుల్, డ్రంకెన్‌డ్రైవ్, మెయింటెనెన్స్ కేసులను కక్షిదారులు రాజీతో పరిష్కరించుకోవాలని కోరారు. అదే విధంగా పోలీస్‌శాఖ వారు కక్షిదారులతో సంప్రదించి ఎక్కువ మొత్తంలో కేసులను రాజీచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రజిని, జిల్లాలోని న్యాయమూర్తులు, కోర్టుల పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ఆర్డీవో జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

జాతీయ స్థాయికి క్రీడాకారుల ఎంపిక

» కబడ్డీ పోటీలకు గద్వాలకు చెందిన సద్దాం, ఆత్మకూరుకు చెందిన శివకృష్ణ

» షూటింగ్ బాల్ పోటీలకు నర్వ విద్యార్థిని మమత



సద్దాం


శివకృష్ణ


మమత

గద్వాల అర్బన్/ ఆత్మకూరు/ నర్వ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. కబడ్డీ పోటీలకు జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన సద్దాం ఎంపికైనట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి, కార్యదర్శి నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 7 వరకు అదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో సద్దాం ప్రతిభ కనబరచి నేషనల్ ప్రాబబుల్స్ క్యాంపునకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. శిబిరంలో ప్రతిభ చాటిన సద్దాం జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో జిల్లాలో నిర్వహించనున్న కబడ్డీ సీనియర్ పోటీల్లో అతడు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సద్దాంను బీజేపీ నాయకుడు బండల వెంకట్రాములు, టి.రామాంజనేయులు, మిర్జాపురం వెంకటేశ్వర్ రెడ్డి, చైర్మన్ అబ్రహం, కోశాధికారి చందు, ఆర్గనైజేషన్ సెక్రటరీ టి.రవి అభినందించారు.

- వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన తెలుగు శివకృష్ణ కబడ్డీ సీనియర్ జట్టుకు ఎంపికైనట్లు వనపర్తి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మూలమల్ల గ్రామ పెద్దలు దేశాయ్ సరళాదేవి, సీనియర్ క్రీడాకారులు ధర్మారెడ్డి, ఎల్లప్ప, చంద్రశేఖర్ గౌడ్, అశోక్, వెంకట్‌రాములు, శ్రీనివాస్‌గౌడ్, పానుగంటి రాజు, కేశవ్ ఆయనను అభినందించారు.

- నారాయణపేట జిల్లా, నర్వకు చెందిన మ్యాతరి మధుబాబు కుమార్తె మమత షూటింగ్‌బాల్ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యింది. గత నెల హైదరాబాద్‌లోని దోమలగూడ ప్రభుత్వ వ్యాయామశాలలో నిర్వహించిన షూటింగ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు, జూనియర్స్ విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరచి, జాతీయ స్థాయికి అర్హత సాధించింది. ఈ నెల 21 నుంచి నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రారంభం కానున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆమె పాల్గొననున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ గోపాలం తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

» కబడ్డీ పోటీలకు శివశంకర్

» అథ్లెటిక్స్ విభాగంలో దండు రామ్‌చరణ్


శివశంకర్


రామ్‌చరణ్

ఊట్కూర్ / తెలకపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న శివశంకర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 34వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ఆ విద్యార్థి పాల్గొననున్నట్లు పీడీ సాయినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శివశంకర్‌ను ప్రధానోపాధ్యాయిని కుసుమ, ఉపాధ్యాయులు అభినందించారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న దండు రామ్‌చరణ్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కల్వకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల మూడున నిర్వహించిన పోటీల్లో, 400 మీటర్ల పరుగు పందెంలో అతడు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు నరహరి, ఫిజికల్ డైరెక్టర్ ఎత్తం బాలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 18న నిర్వహించనున్న పోటీల్లో అతడు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలి

» కల్వకుర్తి సీఐ బి.నాగార్జున



క్రీడాకారులతో సీఐ నాగార్జున, ఉపాధ్యాయులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి, రాష్ట్ర స్థాయిలో రాణించాలని కల్వకుర్తి సీఐ బి.నాగార్జున కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించిన క్రీడా పోటీల్లో 25 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మార్కెట్ చైర్‌పర్సన్ మనీలా సంజుకుమార్ సమకూర్చిన క్రీడా దుస్తులను వారికి అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ మాధవరెడ్డి, పీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామ్‌లక్ష్మణ్‌కు స్పోర్ట్స్ లీడర్‌షిప్ పురస్కారం


రామ్‌లక్ష్మణ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : చెస్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ స్పోర్ట్స్ లీడర్‌షిప్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఇంటర్‌నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిట్‌నెస్, స్పోర్ట్స్ సైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించి కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్, వ్యాయామ సంచాలకులుగా పని చేస్తున్నారు. 2016-17లో నాగర్‌కర్నూల్ జిల్లా ఉత్తమ శారీరక విద్యా సంచాలకుడు, 2017లో భారత జ్యోతి పురస్కారాన్ని అందుకున్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

గండీడ్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడు మండల పరిధిలోని సల్కర్‌పేట్ గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి సురేశ్ కొంతకాలంగా లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా విక్రయిస్తున్నాడు. విషయాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం తనిఖీలు నిర్వహించారు. అతడి వద్ద ఎనిమిది బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొండంత పని..

గోరంత వేతనం

» గ్రామ పంచాయతీల్లో కారోబార్ల వెతలు » చాలీచాలని జీతాలతో నిత్యం అవస్థలు

» ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ కరువు » సమస్యలు పరిష్కరించాలని వినతి


ఖిల్లాఘణపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాలను అందిస్తున్న కారోబార్ లక్ష్మీనారాయణ

ఖిల్లాఘనపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పని చేసే కారోబార్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొండంత పనికి గోరంత వేతనం అన్నట్లుగా వారి పరిస్థితి తయారయ్యింది. మేజర్ గ్రామ పంచాయతీలో ప్రజలకు ఏ అవసరం


మానాజీపేటలో స్థానికుడికి ఓటర్ జాబితాను చూపిస్తున్న కారోబార్

వచ్చినా స్థానికంగా ఉండే కారోబార్ అందుబాటులో ఉండాల్సి వస్తోంది. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలు, ఓటర్ జాబితా సర్వే, పారిశుధ్య నిర్వహణ, హరితహారం, నర్సరీలో మొక్కల పెంపకం, పంపిణీ పర్యవేక్షణ, తాగునీటి సరఫరా, పైప్‌లైన్ల మరమ్మతు, విద్యుత్ మోటార్లు, వీధి దీపాల నిర్వహణ తదితర అన్ని పనుల్లో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారిని మల్టీపర్పస్ వర్కర్లుగా గుర్తించిన గత ప్రభుత్వం, గ్రామ పంచాయతీల్లో పని చేసే ఉద్యోగులందరికీ 51 జీవో ప్రకారం రూ. 9500 వేతనం ఇవ్వాలని నిర్ణయించింది. నాటి నుంచి అరకొర వేతనంతో కారోబార్లు బతుకు బండిని నెట్టుకొస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నా, ప్రభుత్వం క్రమబద్దీకరించడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని గతంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు విన్నవించినప్పటికీ ఫలితం లేదని వాపోతున్నారు. ఇంత పని చేస్తున్నా, అరకొర వేతనమే ఇస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదని చెప్తున్నారు.

ప్రత్యేక కేటగిరీ హోదా ఇవ్వాలి

ప్రత్యేక కేటగిరీ హోదా ఇచ్చి తమను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని కొంత కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రతీ నెల తమకు వచ్చే రూ. 9500 వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, కష్టానికి తగిన ప్రతిఫలం రావడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం తమకు కనీస వేతనం రూ.21వేలు అందిస్తూ, ప్రభుత్వమే నేరుగా తమ ఖాతాల్లో వేతనం జమ చేయాలని అభిప్రాయపడుతున్నారు.

సెలవులు లేని కొలువు

గత ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు అందరినీ మల్టీపర్పస్ వర్కర్స్‌గా గుర్తించింది. దీంతో వారి ఉద్యోగం సెలవులు లేని కొలువుగా మారింది. అలా కాకుండా కారోబార్‌లను మల్టీపర్పస్ వర్కర్స్ నుంచి మినహాయించాలని కోరుతున్నారు. కారోబార్లతో పాటు మల్టీపర్పస్ వర్కర్లు అందరికీ గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి వేతనాలు అందిస్తున్నారు. కొన్నిసార్లు పంచాయతీల్లో నిధులు లేక సకాలంలో వేతనాలు అందక ఇబ్బంది పడిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం కూడా మూడు నెలలుగా పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందడం లేదు. ఇటీవల మల్టీ పర్పస్ వర్కర్లకు సంబంధించిన డాటాను ప్రభుత్వం తీసుకున్నది. ఈ క్రమంలో కారోబార్ల వేతనాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారం తగ్గుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అలాగే తమకు వేతనాలను పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు.

పర్మినెంట్ చేయాలి



గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లను పర్మినెంట్ చేయాలి. మల్టీ పర్పస్ వర్కర్స్ నుంచి మినహాయించాలి. అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వం నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయాలి. సమస్యలను పరిష్కరించాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలి.

- శ్రీనివాసులు , కారోబార్, మానాజీపేట

గుర్తింపులేని ధ్రువపత్రాలతో ఉద్యోగాలు

» వ్యవసాయ శాఖలో ఏఈవోలుగా నియమితులయ్యారని ఫిర్యాదులు

» విచారణను వేగవంతం చేసిన పోలీసులు » వ్యవసాయ శాఖ ఉద్యోగుల్లో ఆందోళన

గద్వాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గుర్తింపులేని ధ్రువపత్రాలతో వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు పొందిన వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇప్పటికే ఒకరిని తొలగించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణను వేగవంతం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వ్యవసాయశాఖ జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలో 99 క్లస్టర్లు ఉన్నాయి. వారిలో 17 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాగా, 82 మంది రెగ్యులర్ ఏఈవోలు ఉన్నారు. 2017లో చాలా మంది రెగ్యులర్ ఏఈవోలుగా నియమితులయ్యారు. వారిలో కొందరు గుర్తింపులేని విశ్వవిద్యాలయాలతో పాటు, నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందారనే ఫిర్యాదు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా విచారణ చేపట్టారు. గద్వాల జిల్లాలో


జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం

నరేశ్ అనే ఏఈవో గట్టు, మల్దకల్ మండలాల్లో పనిచేస్తూ డిప్యుటేషన్‌పై ఇతర జిల్లాలకు వెళ్లాడు. 2024, జనవరిలో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయాడు. ఆయన ఇచ్చిన ధ్రువపత్రాలు నకిలీవని విచారణలో తేలింది. దీంతో అదే ఏడాది మార్చిలో డివిజినల్ వ్యవసాయ అధికారి ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు అయ్యింది. అలాంటి ధ్రువపత్రాలతోనే ఆయన బంధువు ఒకరు ఏఈవోగా ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. వారికి నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చింది ఎవరు, ఇప్పటి వరకు ఎంతమందికి ఇచ్చారు, వారిలో ఎంత మంది ఉద్యోగాలు సాధించి ఏఏ జిల్లాల్లో పనిచేస్తున్నారనే విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ స్పందిస్తూ, విచారణ నిర్వహిస్తున్నామని, త్వరలో వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సక్రియనాయక్ స్పందిస్తూ నరేశ్ స్వయంగా రాజీనామా చేశాడని, విచారణ జరుగుతోందని చెప్పారు.

స్పౌజ్ బదిలీల్లో తప్పుడు ధ్రువపత్రాలు

» జోగుళాంబ గద్వాల జిల్లాలో భర్త ఉద్యోగం » పాలమూరులో ఉన్నట్లు చూపించి పోస్టింగ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటీవల జీవో 317 ప్రకారం జరిగిన స్పౌజ్ బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి మహబూబ్‌నగర్ జిల్లా విద్యాధికారులను బురిడీ కొట్టించిన ఘటన వెలుగు చూసింది. గతంలో 317 జీవో ద్వారా పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయులు నష్టపోయారు. దాన్ని సవరించేందుకు వేర్వేరు జిల్లాల్లో పని చేస్తున్న భార్యాభర్తలను ప్రభుత్వం ఒకే జిల్లాకు తీసుకొచ్చేందుకు స్పౌజ్ కేటగిరీ కింద బదిలీలకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో రాము అనే వ్యక్తి జోగులాంబ గద్వాల జిల్లాలో పౌరసర ఫరాల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన భార్య శ్వేత నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండల పరిధి లోని గొరిట ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు. అయితే భర్త మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్నట్లుగా తప్పుడు సమాచారం ఇచ్చి కౌకుంట్ల మండలం, ముచ్చింతల ప్రాథమిక పాఠశాలలో పోస్టింగ్ తీసుకున్నారు. ఆ సమయంలో ఇద్దరి సర్వీస్ బుక్కులను వెరిఫై చేయించుకోలేదు. ఈ విషయంపై యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, వెంకటేశ్ ఈ నెల మూడున విద్యాశాఖ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కార్యాలయ సెక్షన్ ఇన్‌చార్జి రవిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరింది. ఆ విషయం తమ దృష్టికి రాలేదని, సర్వీస్ పుస్తకాలను నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలనకు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఇదే విషయంపై డీఈవో ప్రవీణ్ కుమార్‌ను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

అద్దె చెల్లించని దుకాణాలు సీజ్

» వచ్చేనెల 31 లోపు మొత్తం చెల్లించాలని హెచ్చరిక

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలో అద్దె దుకాణాల మొండి బకాయిల వసూలుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే గడియారం చౌరస్తా, మార్కెట్ రోడ్‌లో ఉన్న 28 అద్దె దుకాణాలను సీజ్ చేశారు. సోమవారం బస్టాండ్ పక్కనే ఉన్న రెవా హోటల్ దుకాణాల సముదాయాన్ని సీజ్ చేశారు. దీనిపై రూ.50 లక్షల అద్దె బకాయి ఉందని అధికారులు తెలిపారు. ఇకపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. అద్దె చెల్లించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గడియారం చౌరస్తా, మార్కెట్ రోడ్‌లో అద్దె బకాయి ఉన్న వ్యాపారులు మార్చి 31 లోగా మొత్తం చెల్లించాలని, లేకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే నగర పరిధిలో లీజు పూర్తయిన 20 నుంచి 30 దుకాణాలకు వేలం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.



రెవా హోటల్‌ను సీజ్ చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

భూ సర్వేను అడ్డుకున్న రైతులు


రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

మక్తల్‌రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : భూ సర్వే కోసం వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతలలో భాగంగా కాట్రేవ్‌పల్లి గ్రామ శివారులో పంప్‌హౌస్ నిర్మించనున్నారు. అందుకోసం భూములను సర్వే చేసేందుకు సోమవారం తహసీల్దార్ సతీశ్‌కుమార్, ఆర్ఐ రాములు, సర్వేయర్లు రాజన్న, అరుణలు గ్రామానికి చేరుకున్నారు. గ్రామ శివారులోని భూములను సర్వే చేసేందుకు సిద్ధం కావడంతో రైతులు అడ్డుకున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే తాము భూములను కోల్పోతే ఏలా బతకాలని ప్రశ్నించారు. సర్వేను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న డీఎస్పీ లింగయ్య, సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డిలు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం ముందస్తు సర్వే మాత్రమే చేస్తున్నారని, సహకరించాలని సూచించారు. ఆందోళనలో రైతులు రాజు, అశోక్, శ్రీనివాసులు, నారాయణ, కురుమ య్య, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇల్లు అద్దెకు కావాలని వచ్చి దోపిడీ

» 12 తులాల బంగారంతో ఉడాయించిన మహిళలు

అచ్చంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఇద్దరు మహిళలు గృహిణి మెడలో నుంచి బంగారం లాక్కొని ఉడాయించారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివసించే ధరణి అనే మహిళ ఇంటికి ఇద్దరు మహిళలు బురఖాలు ధరించి వచ్చి ఇల్లు అద్దెకు కావాలని అడిగారు. దీంతో ఇంటిని చూపించేందుకు వారిని లోనికి తీసుకెళ్లి చూపిస్తుండగా ఆమెపై దాడికి యత్నించి, కత్తి చూపించి చంపేస్తామని బెదిరించారు. దీంతో తనను ఏమీ చేయొద్దని వేడుకుంటుండగా ఆమె మెడలో ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలను లాక్కొని పరారయ్యారు. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. దొంగలు బుర్ఖా ధరించడంతో వారిని గుర్తించడం సవాలుగా మారింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తెలకపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని పెద్దూరు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందారు. సంఘటనకు సంబంధించి గ్రామస్థులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రాకొండకు చెందిన కొట్టె పెద్ద పర్వతాలు ద్విచక్రవాహనంపై పెద్దూరుకు వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. పర్వతాలు దగ్గరున్న రూ. 38 వేలు, జియో కీప్యాడ్, ఫోన్‌లను డాక్టర్ అన్వర్, పోలీస్ అవుట్ పోస్ట్ సిబ్బంది సిబ్బంది సమక్షంలో అతడి కుమార్తె లావణ్య, ఆమె భర్త ఆంజనేయులకు అందించారు. కార్యక్రమంలో ఈఎంటీ శ్రీకాంత్, 108 పైలట్ కలాం పాషా పాల్గొన్నారు.

వస్త్ర దుకాణానికి నిప్పంటించేందుకు యత్నం

» సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో


సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యం

అయిజ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలోని ఓ వస్త్రదుకాణానికి ఓ మహిళ నిప్పు అంటించేందుకు యత్నించింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలో ఉన్న వస్త్ర దుకాణం వద్దకు శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ మహిళ వచ్చింది. ఒక న్యూస్ పేపర్‌ను చుట్టచుట్టి షెట్టర్ సందుల్లోంచి దుకాణంలోకి తోసింది. మరో వైపున అగ్గిపుల్లతో నిప్పు అంటించింది. కాగితం అంటుకోగానే అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ దృశ్యాలు సోమవారం సమాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ విషయమై ఎస్ఐ శ్రీనివాసరావును వివరణ కోరగా, తమకు ఫిర్యాదు రాలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

చిన్నంబావి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, చిన్నంబావిలో ఓ బాలిక జ్వరం మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఈ సంఘటన జరిగింది. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బాలిక సోమవారం ఉదయం ఐదు జ్వరం మాత్రలు ఒకేసారి మింగి అపస్మారక స్థితికి చేరింది. గమనించిన తోటి విద్యార్థినులు పాఠశాల సిబ్బందికి తెలిపారు. వెంటనే బాలికను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయురాలు సుజాత స్పందిస్తూ తాను సెలవులో ఉన్నానని, ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

న్యూస్ బాక్స్

మహిళా సొసైటీకి ఆర్థిక సహాయం



రక్షిత మహిళా సొసైటీకి ఆర్థిక సహాయం అందజేసిన మాజీ జడ్పీటీసీ అనురాధ

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కోసం సీబీఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనురాధ రూ.50వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రక్షిత సొసైటీ ద్వారా శిక్షణ పొందిన మహిళామణులకు శిక్షణ సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. రక్షిత మహిళా సొసైటి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నప్రసాదం పంపిణీ

కందనూలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయ ఆవరణలో శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శివదీక్ష స్వీకరించిన శివస్వాములకు, శివ భక్తులకు ఈ నెల 17 సోమవారం నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేకంగా మడితో కూడిన అన్నప్రసాద పంపిణీ ఏర్పాటు చేయనున్నట్లు ట్రస్టు సభ్యులు దొడ్ల ఈశ్వర్‌రెడ్డి ఇందుమతిలు తెలిపారు. ఈ ప్రాంతంలోని శివస్వాములు శ్రీశైలం కాలినడకన వెళ్తున్న స్వాములు, భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించాలని వారు కోరారు. స్వాములకు నీటి వసతి, సెల్‌ఫోన్‌చార్జింగ్, వసతి ఏర్పాటు చేశామన్నారు.

వేంకటేశ్వర స్వామి దేవాలయ గ్రామ కమిటీ ఎన్నిక



దేవాలయ నూతన కమిటీ సభ్యులు

చారకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజర గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ గ్రామ పెద్దల సమక్షంలో ఎనుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ము వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా వంగ శ్రీనివాసులుగౌడ్, చింతకుంట్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా చింతోజు శ్రీకాంత్‌చారి, సహాయ కార్యదర్శిగా రాపోతు మహేష్‌గౌడ్, కోశాధికారిగా కొమ్ము ముఖేష్‌యాదవ్, సహాయ కోశాధికారిగా వంగ సుధాకర్‌గౌడ్‌లతో పాటు 21 మందిని సలహాదారులుగా, మరో 35 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొమ్ము రాజయ్యయాదవ్, చెన్న రాములుగౌడ్, కడపర్తి సంజీవరావు, ముమ్మడి రమేష్, కొమ్ము చంద్రయ్య, కొమ్ము నిరంజన్, అంపని సమోదర్, వంగ విష్ణుగౌడ్, మహేష్‌గౌడ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



హెచ్‌ఎంకు ప్రింటర్‌ను అందజేస్తున్న రవీందర్‌గౌడ్

ఉప్పునుంతల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలోనిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు పెనిమిళ్ల గ్రామానికి చెందిన మార్పుకుల రవీందర్‌గౌడ్ 27 వేల విలువ గల ప్రింటర్‌ను సోమవారం పాఠశాలకు వితరణ చేశారు. హెచ్‌ఎం చందు నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

శివస్వాముల ఇరుముడి



ఇరుముడులతో శ్రీశైలం బయల్దేరిన శివస్వాములు

కందనూలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్ గల పురాతన శివాయంలో నీలకంటేశ్వర సన్నిధానం శివస్వాములు సోమవారం గురుస్వామి పలుస విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇరుముడిని స్వామివారికి సమర్పణ చేయడానికి శ్రీశైలం బయల్దేరారు. శివగురుస్వామి కొండకింది మాధవరెడ్డి, బొజ్జన్న, మూర్తి, సతీష్, గౌరీ శంకర్, రాణ నిరంజన్, శ్రీకాంత్ నాయక్, వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 12 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ప్రజావాణికి 12 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. తగు న్యాయం గురించి 3, భూమి పంచాయతీలు 5, ఫ్యామిలీ గొడవలు 4 పిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు దారులతో స్వయంగా ఎస్పీ మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

బైపాస్ బాధితులకు ఎర్రజెండా అండ

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్ శ్రీను



తహసీల్దార్ కార్యాలయం ముందు బైపాస్ బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

చారకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి (167)లో భాగంగా చారకొండ నుంచి మర్రిపల్లి వరకు బైపాస్ రోడ్డుకు అడ్డుగా వస్తున్న 29 ఇళ్ల కోల్పోయిన బైపాస్ రోడ్డు బాధితులకు ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీను అన్నారు. మండల కేంద్రంలోని చెర్కుపల్లి చౌరస్తాలో ఇళ్ల కోల్పోయిన బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. రిలే నిరాహార దీక్షలు చేపట్టిన బాధితులకు సీపీఎం, సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్ష శిబిరం నుంచి బాధితులతో కలిసి సీపీఎం, సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్. శ్రీను మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో ఇళ్ల కోల్పోయిన బాధితులకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇళ్లను నేలమట్టం చేయడంతో దిక్కుతోచని స్థితిలో కిరాయి ఇళ్లలో తలదాచుకున్నారని అన్నారు. బాధితులు నానా అవస్థలు పడుతున్నా ప్రభుత్వం నేటి వరకు వారిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని దుయ్యబట్టారు. బాధితులకు ఇచ్చిన పరిహారంతో ఎక్కడా కూడా 100 గజాల జాగరాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి బాధితులకు ఇళ్ల జాగాతో పాటు, నూతన ఇళ్లను నిర్మించి రూ. 50 లక్షలు పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే బాధితుల తరుపున జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ జిల్లా సమితి నాయకుడు డాక్టర్ చిలివేరు శ్రీ నివాసులు, సీపీఐ మండల కార్యదర్శి అశోక్‌గౌడ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.ఆంజనే యులు, జిల్లా కమిటీ సభ్యుడు ఏపీ మల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి, రాష్ట్ర ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక సంపాదకుడు కె. వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా నాయకుడు పి.గోపాల్, పాలమూరు అధ్యయన వేదిక కల్వకుర్తి కన్వీనర్ అశోక్ గౌడ్, రైతుసంఘం జిల్లా నాయకుడు టి.కిషోర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు ప్రేమ్‌కుమార్, బాధితులు చిట్టెమ్మ, అలివేల, విజయ, వెంకటమ్మ, రాములమ్మ, అశోక్‌రెడ్డి, లాలమ్మ, అనసూయమ్మ, శిరీష, సుమతమ్మ పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



జూపల్లిలో కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్

ఊర్కొండ/చారకొండ/పెద్దకొత్తపల్లి/బల్మూరు/వంగూరు/తిమ్మాజిపేట/ పెంట్లవెల్లి/ కొల్లాపూర్/అచ్చంపేటటౌన్/వెల్దండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచి, పలు చోట్ల బాణసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. పలు ఆలయాల్లో కేసీఆర్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల మొక్కలు నాటారు. ఊర్కొండ మండలం ఊర్కొండపేట అభయాంజనేయస్వామి వారి ఆలయంలో కేసీఆర్ పేరున ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు గిరినాయక్, వీరారెడ్డి, బక్క జంగయ్య, రమేష్, మ్యాకల శ్రీనివాసులు, కృష్ణ గౌడ్, కొమ్మురాజయ్య, కలీంపాష, రాజశేఖర్, శేఖర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. చారకొండలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎదిరే రవీందర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గజ్జె యాదయ్యగౌడ్, సవారి శ్రీను, సలీం, చండిశ్వర్‌గౌడ్, సత్యంగౌడ్, యాద గిరిగౌడ్, మహేష్‌గౌడ్, కమలాకర్‌రావు, శ్రీశైలం, కొండల్, సవారి జంగయ్యగౌడ్, జానపాండు, ఇదమయ్య, బొజ్జయ్య, తిరుపతయ్య, అంజనేయులు, జగపతి, సర్రాం, శివగౌడ్, శ్రీను, కేసీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, జూపల్లి గ్రామంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్, కల్వకుర్తి మాజీ మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం హాజరై కేక్ కట్‌చేశారు. మాజీ ఉపసర్పంచ్ కలమందల జగపతి, నాయకులు భిక్షపతి యాదవ్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సలీం, బీఆర్ఎస్ మండల కార్యదర్శి పగడాల ఆంజనేయులు, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్, కొండల్, శ్రీరాములు, మంతోజు తిరుపతయ్యాచారి, బొజ్జయ్య, రియాజ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు. పెద్దకొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు కట్ట రాజేందర్‌గౌడ్, సింగారం వెంకటయ్యయాదవ్, మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుజ్జుల పరమేష్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్, మాజీ సర్పంచ్ జక్కుల నరసింహ, కొత్తపేట సింగిల్ విండో వైస్ చైర్మన్ రామ్‌యాదవ్, నాయకులు మోహన్‌రెడ్డి, బండి రవి, ప్రదీప్, విష్ణుయాదవ్, కల్మూరు రాములు, తిప్పరాజు, మల్లేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. బల్మూరులో జరిగిన కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నర్సయ్యయాదవ్, మాజీ ఎంపీపీ కరుణాకర్‌రావు, నాయకులు బండపల్లి వెంకటయ్య, మహమూద్‌ఆలీ, చింత చందు, నాగయ్య, తిరుపతయ్య, ప్రతాప్‌రెడ్డి, అంకులయ్య, గౌరమోని రాములు, దేవస్వామి, శ్రీశైలం, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పిల్లి బాలరాజు, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు. వంగూరులో నాయకులు ప్రవీన్‌రెడ్డి, జంగయ్య, మంద రాజేందర్‌రెడ్డి, ఎల్లగౌడ్, నిరంజన్ పాల్గొన్నారు. తిమ్మాజిపేటలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రామ్‌దేవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హరియా రవినాయక్, మాజీ ఎంపీటీసీ బాలయ్య, మాజీ మార్కెట్ డైరెక్టర్లు హుసేనీ, కొత్త వెంకటేష్, నాయకులు స్వామి, నాగరాజుగౌడ్, మల్లేష్, తార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. పెంట్లవెల్లిలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, బీఆర్ఎస్ నాయకులు రాజేష్, సురేందర్‌గౌడ్, ఎస్‌కే ఖాజా, గోవురాజు, రఫియొద్దీన్, అబ్దుల్లా, జ్ఞానేశ్వర్, రవిగౌడ్, వెంకటయ్యగౌడ్, సుమన్‌గౌడ్, బంకలి నరసింహ తదితరులు పాల్గొన్నారు. కొల్లాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రజిత, భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు రామ్‌చందర్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు సాంబశివుడు, నాయకుడు కట్ట శ్రీనివాసులు పాల్గొన్నారు. అచ్చంపేటలో జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎడ్ల నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు శంకర్ మాదిగ, అమీనొద్దీన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. వెల్దండలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి , మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ వెంకటయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు శేఖర్, నాగులునాయక్, నాయకులు చల్ల మధుసూదన్‌రెడ్డి, కొండల్‌యాదవ్, భాస్కర్ రావు, ఆనందు, నిరంజన్, చంద్రమోహన్‌రెడ్డి, జోగయ్య, ప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, హన్మంతునాయక్, అంజినాయక్, వెంకటయ్య పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో కేసీఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కౌశిక్ చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

● సీపీఎం, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



విద్యార్థి కౌశిక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గనమోని కౌశిక్ అనే విద్యార్థి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు ఎస్ఐ హృషికేష్‌ను కలిసి తక్షణమే విద్యార్థి చావుకు కారణమైన వారిని అరెస్టు చేయాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ఎస్ఐని కోరారు. సోమవారం విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి కౌశిక్ చిత్రపటానికి సీపీఎం ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. బాధిత తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసి, మనోధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ... గనమోని కౌశిక్ మరణానికి సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చావుకు కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి పాఠశాల నుంచి మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్లి ఇంట్లోనే శవమై ఉన్నాడని, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మరణానికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని, కుటుంబానికి అన్ని విధాల ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర్గం శివవర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మూడావత్ తారాసింగ్, ఆవాజ్ కన్వీనర్ ఎండీ సలీంపాషా, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శివకుమార్, డివిజన్ నాయకులు కార్తీక్, కేవీపీఎస్ మండల కార్యదర్శి బత్తిని రాజు, సీఐటీయూ నాయకులు పెబ్బేటి వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



డిపో మేనేజర్ యాదయ్యకు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కందనూలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నెల్లికొండ గేట్ దగ్గర ఉన్న ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల శ్రీపురం రోడ్డులో రూబీ గార్డెన్‌కు దగ్గర ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంఘనమోని బంగారు బాబు డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ డిగ్రీ కళాశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కాలేజీ, సైన్స్ కాలేజీ విద్యార్థులకు ఉదయం సాయంత్రం బస్సు లేక విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారని, కళాశాలకు రావడానికి నానా తంటాలు పడి రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9:45గంటలకు సాయంత్రం 4:15 గంటలకు కళాశాలలకు బస్సు సౌకర్యం కల్పించాలని, అన్ని కళాశాలల గేట్ల దగ్గర బస్సులు ఆపాలని డీఎంకు వివరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారుబాబు, నాగర్‌కర్నూల్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మల్లేష్‌యాదవ్, శారద, శివ, కేల్ కన్వీనర్ రమేష్, శివ, భరత్, చాపల నరేష్, మహేష్, రమేష్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలే నాకు ఆత్మీయులు

-నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

కందనూలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే నాకు ఆత్మీయులు.. వారే పార్టీకి బలమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి తాడూరు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఒక్కో సైనికుడిలా పనిచేసి తన గెలుపునకు కృషి చేశారని, 30 సంవత్సరాల తర్వాత ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగిరిందన్నారు. అలాగే ప్రతీ ఒక్క కార్యకర్త కూడా మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారికి అర్థమయ్యే విధంగా చెప్పాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, సర్పంచ్‌లు ఎన్నికలు వస్తున్నందున ప్రతీ ఒక్కరు కూడా గ్రామాల్లో సమన్వయంతో పని చేసి గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఈసారి కూడా కాంగ్రెస్ జెండా ఎగురవేసి మళ్లీ కాంగ్రెస్ కార్యకర్తల బలమేమిటో చూపాలన్నారు. నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, ఆర్టీఏ జిల్లా మెంబరు గోపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తాడూరు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే మెరుగైన విద్య

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే మెరుగైన విద్య అందుతుందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలకు సంబంధించిన 225-26అడ్మిషన్ కరపత్రాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, ఏవో మహమ్మద్‌ఇర్ఫాన్, సీనియర్ అధ్యాపకుడు కోదండరాములు, ఇతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు ధ్వంసంపై ఫిర్యాదు



కలెక్టరేట్‌లో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అమరేందర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెద్దకొత్తపల్లి మండలం చిన్నకార్పాముల గ్రామ పరిధిలో ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డును కొందరు వ్యక్తులు కూలగొట్టారని, బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు సోమవారం ప్రజావాణి లో జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికార దర్పంతో తమ వ్యక్తిగత అవసరాల కోసం ఈ చర్యకు పాల్పడ్డారన్నారు. ప్రజాధనంతో ప్రజా అవసరాల కోసం నిర్మించిన డంపింగ్‌యార్డును కూలగొట్టిన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకుని అందుకు సంబంధించిన అమౌంట్‌ని రికవరీ చేసి, పునర్నిర్మాణం చేయాలని వారు ఆ వినతి పత్రంలో కోరారు. సంబంధిత వ్యక్తులపై పోలీస్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ పెద్దకొత్తపల్లి శాఖ డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. లేకుంటే ప్రజలతో కలిసి ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఉద్యమం చేపడుతామని బీజేపీ నాయకులు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దేశమోని పరుశరాముడు, మాజీ మండల అధ్యక్షుడు పదిర భీమేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రవీణ్‌యాదవ్, తిరుమలయాదవ్, మాజీ ప్రధాన కార్యదర్శి కోట్ల సుధాకర్‌రావు, సింగిల్ విండో డైరెక్టర్ కొత్తపేట మేకల శివ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కృపేందర్, విజయ్, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక కంటి పరీక్షలు



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు

కందనూలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాల మేరకు సోమవారం ప్రభుత్వ పాఠశాలలో దృష్టి లోపం గుర్తించిన విద్యార్థులకు ప్రత్యేక కంటి పరీక్ష శిబిరాన్ని ఆసుపత్రి ఆవరణలో ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రఘు ప్రారంభించారు. అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటదాస్ మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 50,780విద్యార్థులను రెండు విడతలుగా కంటి పరీక్షలు నిర్వహించగా 1,893 మంది విద్యార్థినీ విద్యార్థులకు దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ 1,893మంది విద్యార్థులను నేటి నుంచి మార్చి 5వరకు నాగర్‌కర్నూల్, అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి నేత్ర వైద్య నిపుణులచే మళ్లీ కంటి పరీక్షలు నిర్వహిస్తారు. దృష్టిలోపాలు ఉన్న విద్యార్థినీ విద్యార్థులకు త్వరలో ఉచిత కంటి అద్దాలను అందజేస్తారు. ఆర్ఎంవో డాక్టర్ రవి శంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శైలజ, డాక్టర్ రోహిత్, డాక్టర్ దశరథ్, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ అక్బరుద్దీన్, డాక్టర్ నవీద్, డాక్టర్ సురేష్, డాక్టర్ మహతి, నేత్ర సహాయకులు వెంకటస్వామి, ఆరోగ్య విస్తీర్ణాధికారి జి.విజయ్ కుమార్, ఫార్మాసిస్టు లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్ యాదగిరి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



మాదారంలో మల్లప్ప, ఎల్లమ్మ పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదారం గ్రామంలో కొనసాగుతున్న మల్లప్ప, ఎల్లమ్మ వార్ల పండుగలో జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి సోమవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, నాయకులు పొలే శంకర్, గోపి నాయక్, జగన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలోని ఇప్పపహాడ్ గ్రామానికి చెందిన తల సాని బాల్‌రెడ్డి, దుబ్బ బుచ్చయ్యలు వారం క్రితం బైకు ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట గ్రామ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఘనంగా బీరప్ప బోనాలు

కోడేరు, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీగలపల్లి గ్రామంలో బీరప్ప బోనాలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం కురువ గోపాల కులస్థులు బీరప్ప, ఎల్లమ్మ, మల్లయ్య దేవుళ్లకు పూజలు చేసి భక్తి శ్రద్ధలతో బోనాలతో నైవేద్యం మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, బావాయిపల్లి మాజీ సర్పంచ్ ఎన్వి ఫౌండేషన్ చైర్మన్ నక్క వేణుగోపాల్‌యాదవ్ దేవుళ్లకు పూజలు చేశారు. అన్నదానం కోసం రూ. 25వేలు కుల పెద్దలకు మాజీ ఎంపీపీ అందజేశారు. మాజీ ఎంపీపీ, నక్క గోపాల్‌యాదవ్‌ను కురువ కులస్థులు శాలువాతో సన్మానించారు. వెన్నచర్ల మాజీ ఎంపీటీసీ రవికుమార్, సురేష్, కొల్లాపూర్ బైక్ మెకానిక్ రాజశేఖర్, గోపాల నాగరాజు, గోపాల్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హోటళ్ల తనిఖీ



కల్వకుర్తిలోని హోటల్‌లో తనిఖీ చేస్తున్న మనోజ్

కల్వకుర్తి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని పలు హోటళ్లను, టిఫిన్ సెంటర్లను, రెస్టారెంట్లను సోమవారం ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ మనోజ్ తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా హోటళ్లలో పరిశుభ్రత లేకపోవడం గుర్తించి నోటీసులు ఇచ్చి, శాంపిల్స్‌ను సేకరించామని పేర్కొన్నారు. కల్తీ నిర్ధారణ అయితే చర్యలు తీసుకోనున్నట్లు మనోజ్ తెలిపారు.

అటవీ అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు



ముక్కిడిగుండం గ్రామ ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండల పరిధిలోని ముక్కిడిగుండం గేమ్యా నాయక్ తండా గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు అగ్ని ప్రమాదాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అడవికి దగ్గరలో ఉన్న గ్రామాల ప్రజలకు అడవిలో జరిగే అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అడవిలోకి వెళ్లే సమయంలో అగ్నికి కారణం అయ్యే వస్తువులు తీసుకువెళ్లకుండా జాగ్రత్త వహించాలని నల్లమల వాసులకు సూచించారు. శివ స్వాములు అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా పాదయాత్ర కొనసాగించాలని కోరారు. ఫారెస్టు సెక్షన్ అధికారులు శివకుమార్, జయరాజు, ఫారెస్టు బీట్ అధికారులు కిరణ్ కుమార్, వాల్యా నాయక్, బేస్ క్యాంపు సిబ్బంది, గ్రామ పెద్దలు , శివ స్వాములు పాల్గొన్నారు.